నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, గురువారం 14 నవంబర్ 2024 | HYDERABAD

అనుమతి లేకుండా మందుల విక్రయం.. సీజ్

సిటీబ్యూరో, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ): అనుమతి లేకుండా మందులు విక్రయిస్తున్న మెడికల్ షాపులపై డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారులు దాడులు జరిపారు. డీసీఏ డీజీ వీబీ కమలాసన్‌రెడ్డి కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా ఎర్రపహాడ్ గ్రామంలో డీసీఏ అనుమతి లేకుండా జలగం వెంకటేశ్వర్లు అనే వ్యక్తి మెడికల్ షాప్ నిర్వహిస్తున్నాడు. సమాచారం అందుకున్న డీసీఏ అధికారులు మెడికల్‌షాప్‌పై దాడులు జరిపి రూ.22వేల విలువ చేసే 30 రకాల ఔషధాలను సీజ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా, దేశ్‌ముఖి గ్రామంలో అర్హత లేకుండా క్లినిక్‌ను నిర్వహించడమే కాకుండా డీసీఏ అనుమతి లేకుండా ఔషధాలు విక్రయిస్తున్న ఆకుల గోపీనాథ్‌కు నోటీసులు జారీ చేశారు. అతడి వద్ద నుంచి రూ.38,382 విలువ చేసే 31 రకాల మందులను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. మరో కేసులో ఖమ్మం జిల్లాలో ఆహార ఉత్పత్తులకు సంబంధించిన అనుమతిపై 'పెరొమెన్ ఎక్స్‌టీ' వంటి మాత్రలు తయారు చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్న కేంద్రంపై డీసీఏ అధికారులు దాడులు జరిపారు. ఐరన్, ఫోలిక్ ఆసిడ్, జింక్ సల్ఫేట్ తదితర ఔషధాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. మరో కేసులో కామారెడ్డిలోని పలు మెడికల్ షాపులపై దాడులు జరిపారు. ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్న సొప్రబ్యాక్ట్ క్రీమ్స్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

దావూద్ ఇబ్రహీంలా వ్యవహరిస్తున్న హైడ్రా కమిషనర్

బతుకమ్మకుంట పక్కా ప్రైవేట్ ల్యాండ్

బీఆర్ఎస్ సీనియర్ నేత ఎడ్ల సుధాకర్‌రెడ్డి

అంబర్‌పేట: హైడ్రా కమిషనర్ రాజకీయ నాయకుల్లాగా పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని, ఒక ఐపీఎస్ ఆఫీసరై ఉండి అబద్ధాలు మాట్లాడొచ్చా అని అంబర్‌పేట నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎడ్ల సుధాకర్‌రెడ్డి ప్రశ్నించారు. హైడ్రా కమిషనర్ అచ్చం దావూద్ ఇబ్రహీంలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. బతుకమ్మకుంట స్థల వివాదంపై బుధవారం ఆయన ఛే నంబర్‌లోని కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. బతుకమ్మకుంట స్థలం ప్రభుత్వానిది కాదని, తనదని చెప్పారు. ప్రైవేట్ స్థలంలోకి అక్రమంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఇతర అధికారులు, నాయకులు రావడాన్ని ఖండించారు. వారిపై అంబర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ప్రైవేటు వ్యక్తులతో తనకు కోర్టు కేసు నడుస్తున్నదని, ప్రభుత్వ అధికారులకు తన భూమిపై ఏం సంబంధమని ప్రశ్నించారు. 'నన్ను హౌస్ అరెస్టు చేసి నా భూమిలోకి ప్రవేశించడం క్రిమినల్ చర్య' అని పేర్కొన్నారు. 'బతుకమ్మకుంట అసలు వాటర్ బాడీ కానే కాదు..ఇది పక్కా వేకెంట్ ల్యాండ్..గతంలో అనేక సార్లు ఆధారాలతో కూడిన డాక్యుమెంట్లను హైడ్రా కమిషనర్‌కు అందజేశా'..అని చెప్పారు.

మా ఇండ్లు కూల్చకండి.. ▶ హైడ్రా కమిషనర్ రంగనాథ్ బుధవారం బతుకమ్మ కుంటను సందర్శించిన సందర్భంగా తమ ఇండ్లను కూల్చవద్దని వేడుకుంటున్న స్థానిక మహిళలు.

బతుకమ్మకుంట వద్ద జేసీబీతో వ్యర్థాలు, పిచ్చిమొక్కల తొలగింపు

భయం గుప్పిట్లో బతుకమ్మకుంట

హైడ్రా రాకతో వణికిపోయిన స్థానికులు.. తమ ఇండ్లు కూల్చేస్తారేమోనని ఆందోళనలు

ఇండ్ల జోలికి రావద్దని మూకుమ్మడిగా విజ్ఞప్తి

కచ్చితంగా చెరువును పునరుద్ధరిస్తాం

ఆక్రమణదారులకు నోటీసులిస్తాం

హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టీకరణ

బతుకమ్మకుంట చెరువులో చెత్త, నిర్మాణ వ్యర్థాలు పోయడంతో చెరువు ఆనవాళ్లు కోల్పోయిందని, ముందు చెరువు పునరుద్ధరించడమే తమ లక్ష్యమని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. హైడ్రాకు నోటీసులు ఇచ్చే అధికారముందని, ఆక్రమణదారులకు హైడ్రా నోటీసులు వెళ్తూనే ఉంటాయన్నారు. బుధవారం అంబర్‌పేటలోని బతుకమ్మకుంటను జీహెచ్ఎంసీ, అంబర్‌పేట రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో కలిసి రంగనాథ్ సందర్శించారు. బతుకమ్మకుంట చెరువును పరిశీలించిన కమిషనర్..5.15 ఎకరాల స్థలాన్ని చదును చేసే పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. అయితే బతుకమ్మకుంటకు హైడ్రా బృందం వస్తుందన్న సమాచారంతో స్థానికులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. తమ ఇండ్లు కూల్చేస్తారేమోనన్న భయంతో రెండు నెలలుగా కంటిమీద కునుకు లేకుండా ఉంటున్నామని వీకర్ సెక్షన్ కాలనీవాసులు, స్థానికులు కమిషనర్‌కు చెప్పారు. హైడ్రా బృందం వస్తుందంటేనే కూల్చివేతలు జరుగుతాయన్న భయంతో ఉన్న స్థానికులు కమిషనర్‌ను తమ ఇండ్ల విషయంపై ప్రశ్నించారు. ఒక వైపు స్థానికులకు నచ్చచెప్పే దిశగా తాము ఇప్పుడున్న ఇండ్ల జోలికే వెళ్లమని, ప్రస్తుతం ఉన్న ఖాళీ స్థలాన్ని చదును చేసి చెరువును పునరుద్ధరిస్తామని రంగనాథ్ వారికి చెప్పారు. బతుకమ్మకుంటలో కూల్చివేతలు ఉండవని, కూల్చివేతలు చేపడతామనే అపోహ తొలగించేందుకే తాను బతుకమ్మకుంటకు వచ్చానని రంగనాథ్ చెప్పారు. చెరువులోకి నీరు వచ్చే మార్గాలపై అధికారులతో చర్చిస్తామని, ప్రస్తుతం ఉన్న ఐదు ఎకరాల స్థలంలోనే చెరువును పునరుద్ధరిస్తామన్నారు. చెరువును మరో రెండు నెలల్లో సుందరీకరిస్తామన్నారు.

అంబర్‌పేట బతుకమ్మకుంట ప్రాంతంలో బుధవారం హైటెన్షన్ వాతావరణం నెలకొంది. బతుకమ్మ కుంట ఆక్రమణకు గురైందన్న ఫిర్యాదులతో హైడ్రా బృందం పర్యటించడంతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. పైగా చెరువు చుట్టుపక్కల ప్రాంతంలో భారీగా పోలీసులను మోహరించడంతో తమ ఇండ్లను కూల్చివేస్తారేమోనన్న భయంతో స్థానికులు తీవ్ర ఆందోళనలకు గురయ్యారు. తమ ఇండ్లను కూల్చవద్దంటూ నిరసన తెలిపారు. ఇండ్ల జోలికి రాకుండా చెరువును సుందరీకరించాలంటూ డిమాండ్ చేశారు. ఒక దశలో కమిషనర్ రంగనాథ్‌ను స్థానికులు చుట్టుముట్టి తమ ఇండ్ల విషయంలో నిలదీశారు. అయితే 'చెరువును పునరుద్ధరిస్తాం తప్ప..ఇండ్లను కూల్చేదే లేద'ంటూ కమిషనర్ చెప్పినా.. స్థానికుల్లో భయం మాత్రం పోలేదు.

-సిటీబ్యూరో/అంబర్‌పేట/ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 13(నమస్తే తెలంగాణ)

సర్వే నంబర్ 563లో..

సర్వే నంబర్ 563లో 1962-63 లెక్కల ప్రకారం మొత్తం 14.06 ఎకరాల విస్తీర్ణంలో బతుకమ్మ చెరువు ఉండేదని, బఫర్‌జోన్‌తో కలిపి మొత్తం వైశాల్యం 16.13 ఎకరాల విస్తీర్ణంగా సర్వే అధికారులు తేల్చినట్లు రంగనాథ్ తెలిపారు. స్థానికులు కొందరు తమ వద్ద ఉన్న మ్యాపులు చూపించబోతే తాను ఆ మ్యాపులన్నీ పరిశీలించి, లీగల్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో మాట్లాడిన తర్వాతే బతుకమ్మకుంటకు వచ్చానని, చెరువును ప్రస్తుతం ఉన్న 5.15 ఎకరాల భూమిలోనే పునరుద్ధరిస్తామని చెప్పారు. ప్రస్తుతం అక్కడ నివాసముంటున్న వారికి ఎలాంటి ముప్పు లేకుండా చెరువు తవ్వాలంటూ అధికారులకు సూచించారు. ఒకప్పటి ఎర్రకుంటనే కాలక్రమంలో బతుకమ్మకుంటగా మారిందని స్థానికులు చెప్పడంతో పాటు రెవెన్యూ రికార్డులు కూడా ఇవే చెబుతున్నాయని రంగనాథ్ స్థానికులతో అన్నారు. బతుకమ్మకుంటలో జేసీబీతో వెంటనే పనులు మొదలు పెట్టాలని అధికారులకు చెప్పగా, వారు జేసీబీలను తెప్పించి ఖాళీ స్థలంలో పెరిగిన పిచ్చిమొక్కలు, నిర్మాణ వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని తొలగించే పనులు ప్రారంభించారు. కమిషనర్ రంగనాథ్ వెంట డిప్యూటీ కమిషనర్ సుధ, డిప్యూటీ సిటీ ప్లానర్ రాంరెడ్డి, అంబర్‌పేట సర్కిల్ డీసీ మారుతీ దివాకర్, తహసీల్దార్ వీరాభాయి, టౌన్ ప్లానింగ్ ఏసీపీ సుమిత్రలతో పాటు ఇరిగేషన్ విభాగం అధికారులు ఉన్నారు.

ఉదయం నుంచే హైటెన్షన్..

ఉదయం నుంచి అంబర్‌పేట బతుకమ్మకుంట ప్రాంతంలో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. బతుకమ్మ కుంట ఆక్రమణకు గురైందన్న ఫిర్యాదులతో హైడ్రా బృందం పర్యటించింది. ఈ నేపథ్యంలో చెరువు చుట్టుపక్కల ప్రాంతంలో భారీగా పోలీసులను మోహరించారు. తమ ఇండ్లను కూల్చివేస్తారేమోనన్న భయంతో స్థానికులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. తమ ఇండ్లను కూల్చవద్దంటూ నిరసన వ్యక్తం చేశారు. 'చెరువును పునరుద్ధరిస్తాం తప్ప..ఇండ్లను కూల్చేదే లేద'ంటూ చెప్పిన కమిషనర్..కేవలం అరగంటలోపే అక్కడి నుంచి వెళ్లిపోయారు.

తార్నాకలో ఎర్రకుంట సందర్శన

తార్నాకలోని ఎర్రకుంట చెరువును హైడ్రాకమిషనర్ రంగనాథ్ సందర్శించారు. ఎలాంటి వివాదాలు లేని ఎర్రకుంట చెరువును పునరుద్ధరించాలంటూ నాగార్జున కాలనీ సంక్షేమ సంఘం హైడ్రాను కోరింది. 5.9 ఎకరాల్లో విస్తరించిన చెరువును పునరుద్ధరించి.. సుందరీకరిస్తే దుర్వాసన, దోమల బెడద తప్పుతుందని వారు రంగనాథ్‌కు చెప్పారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు ఎర్రకుంట చెరువును పరిశీలించి.. పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలంటూ అధికారులను రంగనాథ్ ఆదేశించారు.

నాగారంలో ప్రహరీని జేసీబీతో కూల్చివేస్తున్న హైడ్రా

నోటీసులివ్వకుండానే కూల్చేశారు

నాగారంలో కూల్చివేతలు

- రోడ్డు కబ్జా చేశారంటూ ప్రహరీ నిర్మాణాన్ని కూల్చేసిన హైడ్రా
- యజమాని ఒకరైతే.. మరొకరు కబ్జాదారంటూ హడావిడి
- తాము రెగ్యులరైజ్ చేసుకున్నామంటున్న యజమాని

సిటీబ్యూరో/మేడ్చల్ కలెక్టరేట్, నవంబర్ 13(నమస్తే తెలంగాణ): హైడ్రా బృందం మేడ్చల్ జిల్లా నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాజ్‌సుఖ్‌నగర్‌లో బుధవారం హల్‌చల్ చేసింది. స్థల యజమాని లేని సమయంలో ఒక్కసారిగా జేసీబీలతో హైడ్రా బృందాలు వచ్చి రోడ్డుపై అడ్డంగా ఉందంటూ ప్రహరీని కూల్చేసింది. నాగారం మున్సిపాలిటీ పరిధి 16వ వార్డులోని ఈస్ట్ హనుమాన్‌నగర్ రాజ్‌సుఖ్ నగర్ కాలనీలో సర్వే నంబర్ 146లో 40 అడుగుల విస్తీర్ణంలో ఉన్న రోడ్డును ఆక్రమించి కట్టిన నిర్మాణాన్ని కూల్చివేశారు. 40 ఫీట్ల రోడ్డును కబ్జా చేసి ప్రహరీ నిర్మించారని హైడ్రా అధికారులకు కాలనీవాసులు ఫిర్యాదు చేయడంతో బుధవారం హైడ్రా అధికారులు రెండు బృందాలుగా విడిపోయి జేసీబీల సహాయంతో రోడ్డుకు అడ్డుగా నిర్మించారంటూ గోడను తొలగించారు. ప్రజలకు ఇబ్బందిగా ఉన్న రోడ్డు సమస్యను పరిష్కరించాలని పలు కాలనీల వాసుల హైడ్రా దృష్టికి తీసుకురావడంతో అన్ని పత్రాలు పరిశీలించామని, రోడ్డును కబ్జా చేసి నిర్మించినట్లు నిర్ధారించిన తర్వాతే ప్రహరీని కూల్చివేశామని హైడ్రా అధికారులు తెలిపారు. అయితే హైడ్రా బృందం కూల్చివేతలు చేపట్టడానికి అక్కడికి వచ్చిన సమయంలో స్థానికులంతా టెన్షన్ పడ్డారు. ఆక్రమణలంటూ ఎలాంటి నోటీసులు రాకున్నా.. ఎవరి ఇండ్లు కూల్చుతారో అంటూ అందరూ భయపడిన పరిస్థితి. అయితే హైడ్రా ప్రహరీ కూల్చేసిన తర్వాత స్థానికులకు తాము కేవలం ఆక్రమణలు మాత్రమే తొలగిస్తామని చెప్పారు.



అడుగడుగునా హైడ్రామానే..

నాగారంలో హైడ్రా కూల్చివేతల తర్వాత ఆ స్థలాన్ని మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి ఆక్రమించినట్లు చెబుతూ హైడ్రా ప్రెస్‌నోట్ విడుదల చేసింది. నాగారం ప్రధాన రహదారికి కలిపే రోడ్డును నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి ఆక్రమించి ప్రహరీ నిర్మించినట్లు హైడ్రాకు ఫిర్యాదు అందింది. రెండు రోజుల్లో విచారణ చేపట్టి రోడ్డును ఆక్రమించినట్లు హైడ్రా నిర్ధారించింది. వెంటనే కూల్చివేయాలంటూ హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు కూల్చివేసినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. మొదట విడుదల చేసిన ప్రకటనలో కీసర పోలీస్ స్టేషన్‌లో చంద్రారెడ్డిపై ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నప్పటికీ.. మళ్లీ ఫిర్యాదు చేయలేదంటూ వేరొక ప్రకటన ఇచ్చారు. మరో వైపు మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడినట్లు హైడ్రా ప్రెస్‌నోట్‌లో పేర్కొన్నప్పటికీ తనతో ఎవరూ మాట్లాడలేదని కమిషనర్ చెప్పారు. అయితే హైడ్రా కూల్చివేసిన నిర్మాణానికి సంబంధించిన ప్రస్తుత యజమాని పాపిరెడ్డి కాగా హైడ్రా తన ప్రెస్‌నోట్‌లో చంద్రారెడ్డి పేరును ప్రస్తావించింది. అంతేకాకుండా ఈ నిర్మాణానికి సంబంధించి హెచ్ఎండీఏ నుంచి రెగ్యులరైజేషన్ ఉండగా.. గతంలో కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదుపై ఒక కమిటీ నివేదిక కూడా ఇచ్చిందని యజమాని పాపిరెడ్డి చెబుతున్నారు. అయితే స్థల యజమాని పేరు చంద్రారెడ్డి అని ఎందుకు హైడ్రా పేర్కొంటుందో ప్రశ్నార్థకంగా మారింది. అంతేకాకుండా భూమి విషయంలో కోర్టులో కూడా వివాదం నడుస్తోంది. ఇంత జరుగుతున్నా.. హైడ్రా ఎందుకు దూకుడుగా వ్యవహరించిందనేది అర్థం కావడం లేదని స్థానికులు అంటున్నారు. అయితే ఇందులో హైడ్రాపై రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయన్న చర్చ జరుగుతున్నది. స్థానిక కాంగ్రెస్ నేతల ఫిర్యాదు మేరకే ఈ చర్యలకు హైడ్రా పూనుకుందని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల ఫిల్మ్‌నగర్‌లో కూడా హైడ్రా కూల్చివేతలకు స్థానిక కాంగ్రెస్ నేతల ఫిర్యాదే కారణమని యజమాని ఆరోపించారు.

అక్రమంగా కూల్చివేశారు: పాపిరెడ్డి, ప్లాట్ యజమాని

హైడ్రా అధికారులు తన ప్లాటు చుట్టూ ఉన్న ప్రహరీని అక్రమంగా కూల్చివేశారని ప్లాట్ యజమాని పాపిరెడ్డి ఆరోపించారు. 1980లో చేసిన లేఔట్ అని.. తాను 2007లో ఈ ప్లాటు కొనుగోలు చేశానని చెప్పారు. 2012లో రూ.1,19,700 ఎల్ఆర్ఎస్ రుసుం చెల్లించి, హెచ్ఎండీఏలో క్రమబద్ధీకరించుకున్నానని ఆధారాలన్నీ హైడ్రా కమిషనర్‌కు ఇచ్చానని చెప్పారు. గతంలో కాలనీవాసులు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేస్తే అధికారులు విచారణ చేపట్టారని, ఆ విచారణలో తాను కొనుగోలు చేసిన ప్లాటు రోడ్డుకు సంబంధం లేదని తేల్చారన్నారు. కోర్టులో కేసు నడుస్తున్నదని, తన వద్ద ఇంజెంక్షన్ ఆర్డర్ కూడా ఉందని పాపిరెడ్డి చెప్పారు. హైడ్రా అధికారులు కొందరి ఒత్తిడి మేరకు ముందస్తుగా ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా నేరుగా వచ్చి, కూల్చివేశారని, దీనిపై న్యాయం పోరాటం చేస్తానని పాపిరెడ్డి తెలిపారు.

లక్డీకాపూల్‌లోని ఓ హోటల్‌లో తనిఖీ చేస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

ఆహార కల్తీపై మరింత కఠినం

సిటీబ్యూరో: గ్రేటర్‌లో ఆహార కల్తీ రోజురోజుకు పెరుగుతుండడంతో జీహెచ్ఎంసీ అప్రమత్తమైంది. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న హోటళ్లు, రెస్టారెంట్లు, బార్లు, ఐస్‌క్రీం పార్లర్లు, మోమోస్ తయారీ కేంద్రాల నిర్వాహకులు , ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు ఇతర సంస్థలపై మరింత కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. ఈ మేరకు నిబంధనల్లో మార్పులు చేయనున్నది. ప్రస్తుతం తనిఖీలు నిర్వహిస్తున్న జీహెచ్ఎంసీకి నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై తక్షణ చర్యలు తీసుకునే అధికారం లేదు. నమూనాల సేకరణకే ఫుడ్ సేఫ్టీ అధికారులు పరిమితమవుతూ వస్తున్నారు. ఇక మీదట ఉల్లంఘనలకు పాల్పడుతున్న హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర సంస్థలపై చర్యలు తీసుకునేలా, జరిమానా డబ్బులు జీహెచ్ఎంసీ ఖాతాలో జమ అయ్యేలా ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి త్వరలో సమర్పించనున్నారు. కాగా, బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ ఫుడ్ సేఫ్టీ అధికారులతో నగరంలో ఆహార భద్రత మెరుగుపరచడానికి తీసుకోవాల్సిన చర్యలు, పాటించాల్సిన విధానాలపై సమావేశం నిర్వహించి.. అధికారులకు దిశానిర్దేశం చేశారు. అలాగే లక్డీకాపూల్‌లోని మొఘల్ రెస్టారెంట్, మాసబ్‌ట్యాంక్‌లోని డైన్ హిల్ హోటల్‌ను మేయర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హోటళ్లలో కిచెన్ పరిశుభ్రత పాటించడం లేదని తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని, హోటల్ యజమానులు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించాలని మేయర్ సూచించారు.

ఖాకీ కారిన్యం

చిరు వ్యాపారి సోదరుడిపై పోలీసుల దాష్టీకం

లాఠీలతో కుళ్లబొడిచిన వైనం

నిర్ణీత సమయం దాటాక షాప్ తెరిచి ఉంచినందుకు దుశ్చర్య

సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాలు

సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్

వెంగళరావునగర్, నవంబర్ 13: చిరు వ్యాపారి పై పోలీసుల దాష్టీకం ప్రదర్శించారు. నిర్ణీత సమయం దాటిన తర్వాత షాప్ మూసివేయలేదన్న అక్కసుతో లాఠీలతో కుళ్లబొడిచి ఒళ్లు హూనమయ్యేలా చావబాదారు. పోలీసులు పైశాచికంగా లాఠీలతో కొట్టడంతో తీవ్రగాయాలతో బాధితుడు దవాఖాన పాలయ్యాడు. ఖాకీల కాఠిన్య దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి. బోరబండ పోలీసుల అరాచక దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

అసలేం జరిగింది..

బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలోని కార్మికనగర్ కూడలి వద్ద సూఫీ పాన్ షాప్‌ను నిర్వహిస్తుంటాడు. అతడి తమ్ముడు మెహరాజ్(21) ప్రైవేట్ కాలేజీలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుకుంటూ..అన్న సూఫీ పాన్ షాప్‌లో పార్ట్ టైమ్‌గా పని చేస్తుంటాడు. రోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు రోజుకు రూ.500 లకు షాప్‌లో పనిచేసేవాడు. మంగళవారం అర్ధరాత్రి వేళ పాన్ షాప్ మూసివేయించేందుకు గస్తీ పోలీసులు లాఠీలతో లోపలికి జొరబడ్డారు. ఒక్కసారిగా షాప్ ముందున్న విద్యార్థి మెహరాజ్ పై లాఠీలతో విరుచుకుపడ్డారు. కాళ్లు, చేతులపై లాఠీలతో చావబాదారు. పోలీసుల దాడిలో తీవ్రంగా గాయపడిన మెహరాజ్ చికిత్స కోసం అమీర్‌పేట ప్రభుత్వ దవాఖానకు వెళ్లగా, పోలీసులు కొట్టడంతో గాయాలపాలయ్యానంటూ.. ఎంఎల్‌సీ సర్టిఫికెట్ ఇవ్వడానికి వైద్యులు నిరాకరించారని బాధితుడు మెహరాజ్ వాపోయాడు. బోరబండ పోలీసులు లాఠీలతో చావబాదుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి. దీంతో కలవరపాటుకు గురైన ఖాకీలు వెంటనే బాధితుడు మెహరాజ్‌ను పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసిన ఆ వీడియోను డిలీట్ చేయాలని ఒత్తిడి చేశారని బాధితుడు వాపోయాడు. అంతే కాకుండా పోలీసులు ఉద్దేశపూర్వకంగా కొట్టలేదని షాప్‌నకు వచ్చే కష్టమర్ అనుకొని కొట్టారని చెప్పి.. పోలీసులకు అనుకూలంగా ఓ వీడియో తీయాలని చెప్పడంతో బాధితుడు ఒక సెల్ఫీ వీడియో తీసి పంపాడు. తన పై ఒత్తిడి చేసి పోలీసులకు అనుకూలంగా వీడియో తీయించారని బాధితుడు వాపోయాడు.

పొట్టకూటి కోసం పనిచేస్తే..

తానేమీ సంఘ విద్రోహి కాదని..పొట్టకూటి కోసం పనులు చేసుకుని బతుకుతుంటే ఇలా లాఠీలతో చావబాదారని.. ఇలా ఇదే మొదటిసారి కాదని.. గతంలో నాలుగుసార్లు తనపై పోలీసులు దాడికి పాల్పడ్డారని బాధితుడు మెహరాజ్ కన్నీటిపర్యంతమయ్యాడు. నిర్ణీత సమయం దాటాక దుకాణం తెరిచి ఉన్నట్లైతే కేసు పెట్టొచ్చని.. కానీ ఇలా వాతలు తేలేలా చావబాదడం అన్యాయమని వాపోయాడు.